సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం । 12 । జూన్ । 2023



బైక్, కారు ఢీ : ఇద్దరు మైనర్లు మృతి

బైకు, కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మైనర్లు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. - 8లో



పెళ్లికి అడ్డువస్తోందని ప్రేయసి తల్లి హత్య

ప్రేయసితో పెళ్లికి అడ్డు వస్తోందని ప్రియురాలి తల్లిని హత్యచేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.300
రెండోరకం	రూ.150	రూ.220

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1369 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు స్పందన కార్యక్రమం

రాయచోటి: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బి.కొత్తకోట కేంద్రంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు

బి.కొత్తకోట: ఏడేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైన ఐసీడీఎస్ బి.కొత్తకోట ప్రాజెక్టు కల సాకారమైంది. ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులను ఏర్పాటు చేయడంతో బి.కొత్తకోట కేంద్రంగా ప్రాజెక్టు ఏర్పాటైంది. దీనికి సంబంధించి కార్యాలయం సిద్ధం చేస్తున్నారు. బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు మండలాలను కలిపి కొత్త ప్రాజెక్టు ఏర్పాటు చేశారు. ఈ మూడు మండలాల పరిధిలో 221 అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయి. మూడు మండలాలకు 9 మంది ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు బాధ్యతలు అప్పగించనున్నారు. ప్రస్తుతానికి హిజాద్ ప్యారీ, గౌరీ, మంజుల కుమారి, నాగరత్న సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్నారు. వీరితోపాటు మరో ఐదుగురిని సూపర్‌వైజర్లుగా నియమించాల్సి ఉంది. ఐసీడీఎస్ ప్రాజెక్టుకు సీడీపీఓగా కె.భాగ్యమ్మను ప్రభుత్వం నియమించింది.

స్కూలు వద్దకే విద్యార్థుల బస్‌పాసులు

మదనపల్లె సిటీ: నూతన విద్యా సంవత్సరం ఆరంభం కానున్న నేపథ్యంలో స్కూలు వద్దకే విద్యార్థులకు బస్సు పాసులు ఇచ్చేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు మదనపల్లె టు డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ మాట్లాడుతూ విద్యార్థులు డిపో వద్దకు వచ్చి సమయం వృథా చేసుకోవద్దన్నారు. ఇందు కోసం సిబ్బంది ఆయా పాఠశాలల వద్దకు వచ్చి బస్సు పాసు వివరాలు సేకరిస్తారన్నారు. విద్యార్థులు తమ పాత బస్‌పాస్ ఐడి కార్డు, స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు ఇవ్వాలన్నారు. 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు బస్సు పాసులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. 12 ఏళ్ల లోపు బాలురు, 18 ఏళ్ల లోపు బాలికలకు ఉచిత బస్ పాసులు అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ, ఇతర వృత్తి విద్యా కోర్సులు అభ్యసించే విద్యార్థులకు సీజనల్ పాస్‌లు జారీ చేస్తామన్నారు.

విద్యాకానుకలను పక్కాగా పంపిణీ చేయాలి



జి.శ్రీకాంత్ రెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే

రాయచోటి: జగనన్న విద్యాకానుకలను విద్యాశాఖాధికారులు పక్కాగా పంపిణీ చేయాలని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సూచించారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యారంగంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. నాడు–నేడు ద్వారా కోట్లాది రూపాయల వ్యయంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారనున్నాయన్నారు. జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం కింద పదోతరగతిలో పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులను సన్మానించనున్నట్లు తెలిపారు. ఈనెల 28వ తేదీన అమ్మఒడి పథకాన్ని ప్రభుత్వం అమలు చేయనుందని ఎమ్మెల్యే వివరించారు.

జిల్లా సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయంపై పోరు



సీపీఐ జిల్లా శిక్షణా తరగతులలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

బ్రహ్మంగారిమఠం: ఉమ్మడి వైఎస్సార్ జిల్లా సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయంపై సీపీఐ పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. సీపీఐ జిల్లా స్థాయి శిక్షణా తరగతులు బ్రహ్మంగారిమఠంలో మూడు రోజులపాటు జరగనున్నాయి. రెండోరోజు ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టులు, జిల్లా అభివృద్ధి వంటి వాటిపై ప్రతి కార్యకర్త ఉద్యమించాలన్నారు. కేంద్రప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు పరిశ్రమలు కట్టబెట్టడంతో నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా సీపీఐ కార్యదర్శి పీఎల్ నరసింహులు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు కుమార్‌రెడ్డి, జిల్లాకార్యవర్గ సభ్యులు బి.రామయ్య, వి.వీరశేఖర్, కేసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

సెలవులు ముగిసె.. బడికి వేళాయె!

- ఆట పాటలకు టాటా..పట్టంది బడిబాట
- నాడు–నేడుతో కార్పొరేట్ హంగులు
- నేటి నుంచి విద్యార్థులకు జగనన్న విద్యాకానుక



పాఠశాలలకు చేరుకుంటున్న విద్యార్థులు (ఫైల్)



నాడు–నేడుతో అందంగా తయారైన పాఠశాల భవనాలు

మదనపల్లె సిటీ/రాయచోటి: 'విద్యపై ఎంత వెచ్చించినా... అది భవిష్యత్తుకు పెట్టుబడే అవుతుందిగానీ ఎంత మాత్రం వృథా కాదు. సమాజంలోని అసమానతలను చదువుతోనే రూపుమాపగలం. విద్యతోనే పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది. సరిగ్గా ఇదే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగాభివృద్ధికి బాటలు వేస్తున్నారు. దీని కోసం ఏటా బడ్జెట్‌లో రూ.వేల కోట్లు కేటాయిస్తున్నారు. అందులో భాగంగా బడులు ప్రారంభమయ్యే తొలి రోజు ఈనెల 12న సోమవారం నుంచి జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. వేసవి సెలవులు ముగిసి సోమవారం నుంచి జిల్లాలో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. బడి అంటేనే భవిష్యత్తుకు బాటలు వేసే గుడి. పిల్లలు ఆనందంగా, ఆహ్లాదకర వాతావరణంలో చదువుకునే ప్రదేశం. పిల్లలు ఆంగ్లమాధ్యమం చదవాలన్నా .. ఉత్తమ ఫలితాలు సాధించాలన్నా తదనుగుణంగా అన్ని సౌకర్యాలు ఉండాలి. ఇందుకోసం నాడు–నేడు కింద వేలాది కోట్ల వ్యయంతో ప్రభుత్వ బడులను కార్పొరేట్ పాఠశాలలకు మించి అన్ని హంగులతో ముస్తాబు చేసి చదువులకు పెద్ద పీట వేశారు. 2023–24 విద్యా సంవత్సరపు బోధనాభ్యసన కార్యక్రమాలను అన్ని పాఠశాలల్లో సమగ్రంగా కొనసాగించేలా పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి అకడమిక్ క్యాలెండర్‌ను కూడా విడుదల చేసింది. ఏరోజున ఏయే కార్యక్రమాలు చేపట్టాలో అందులో పొందుపరిచింది.

నేడు జేవీకే కిట్ల పంపిణీ

జగనన్న విద్యాకానుక కిట్లను నాణ్యతా ప్రమాణాలతో సిద్ధం చేశారు. ఇందులో మూడు జతల యూనిఫామ్ క్లాత్, జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూలు బ్యాగు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, ఆక్స్‌ఫర్డు ఇంగ్లీష్–తెలుగు డిక్షనరీలు ఉంటాయి. వీటిని విద్యార్థులకు అందజేయనున్నారు. రూ.13,64,367 కోట్ల ఖర్చుతో కిట్లు పంపిణీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

నాడు–నేడుతో మారిన రూపురేఖలు

నాడు– నేడు రెండో విడతలో జిల్లాలోని 1037 బడులలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. నూతన హంగులతో పాఠశాలల రూపకల్పన చేశారు. అదనపు తరగతి గదులు, కాంపౌండ్ వాల్, టాయిలెట్స్, కిచెన్‌గార్డన్స్, మైనర్, మేజర్ పనులు చేస్తున్నారు.

పౌష్టికాహారంతో కూడిన జగనన్న గోరుముద్ద

ఎదిగే పిల్లల కోసం పౌష్టికాహారంతో కూడిన జగనన్న గోరుముద్ద పథకాన్ని పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. దీని కోసం కొత్త మెనూను పాటిస్తున్నారు. అదనంగా రాగిజావ కూడా అందిస్తున్నారు.

8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఇందులో బైజూస్ కంటెంట్‌తో కూడిన పాఠాలు నేర్పిస్తున్నారు.

అర్హులందరికీ అమ్మ ఒడి

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న అర్హులందరికీ అమ్మ ఒడి పథకం వర్తింపజేయనున్నారు. ఇందులో భాగంగా అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి రూ.15 వేలు వారి తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నారు. గత ఏడాది 1,57,292 మంది విద్యార్థులకు రూ.235,93,80,000 కోట్లు విడుదల చేశారు. ఈ ఏడాది అర్హుల జాబితాను సిద్ధం చేశారు. ఈ పథకాన్ని ఈనెల 28న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు.

ప్రభుత్వ బడుల్లో వంద శాతం చేరికలకు కార్యాచరణ

పాఠశాలల ప్రారంభం నేపథ్యంలో స్కూల్ రెడీనెస్ కార్యక్రమాన్ని విద్యాశాఖ చేపట్టింది. దీనిలో భాగంగా ప్రతి పాఠశాలను, పరిసరాలను శుభ్రం చేయించడం, మంచినీటి సదుపాయం కల్పించడం, గ్రామాల్లోని పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించేలా చూడటం లాంటి చర్యలు చేపట్టారు. ప్రభుత్వం విద్యాపరంగా అమలు చేస్తున్న పథకాలను తల్లిదండ్రులకు వివరించి బడిఈడు పిల్లలందరినీ వంద శాతం చేర్పించేలా చర్యలు తీసుకుంటోంది.

జిల్లా సమాచారం

ప్రాథమిక పాఠశాలలు:	1,709
ప్రాథమికోన్నత పాఠశాలలు:	214
ఉన్నత పాఠశాలలు:	296
విద్యార్థులు:	1,54,789
బాలికలు:	75,435
బాలురు:	79,354
బ్యాగులు:	1,54,789
యూనిఫాం:	1,54,789
నోట్‌బుక్స్:	8,87,786
బెల్ట్స్ :	1,10,380
బూట్లు:	1,53,818
డిక్షనరీలు:	17,750

నేటి నుంచి వారం రోజులు ఒంటిపూట బడులు

వేసవి సెలవులు ముగిసినప్పటికీ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వలన పాఠశాలలను సోమవారం నుంచి వారం రోజుల పాటు ఒంటిపూట మాత్రమే నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం పాఠశాలలు ఈనెల 17 వరకు ఉదయం 7.30 గంటల నుంచి 11.30 గంటల వరకు పని చేస్తాయి. వాతావరణ శాఖ సూచనల మేరకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వం ఉపాధ్యాయులను ఆదేశించింది. రాగిజావ ఉదయం 8.30 నుంచి 9లోపు, మధ్యాహ్న భోజనం 11.30 నుంచి 12 వరకు అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

పకడ్బందీగా ఏర్పాట్లు



పాఠశాలల పునః ప్రారంభానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం. నూతనంగా కొలువులో చేరిన ఉపాధ్యాయులకు ఇది వరకే ఇండక్షన్ శిక్షణను పూర్తి చేశాం. బడి ఈడు పిల్లలందరిని పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు చేపట్టాం. ఎప్పటికప్పుడు పాఠశాలలను సందర్శించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్ట పరిచి విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందిస్తాం. పాఠశాలలు ప్రారంభించిన రోజు నుంచే మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అందించాలని ఆదేశించాం. పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక కిట్లను అందజేస్తాము. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు కూడా ప్రభుత్వమే పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అందజేస్తుంది. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన వారు ఎవరైనా చర్యలు తప్పవు.

–పురుషోత్తం, డీఈఓ, అన్నమయ్య జిల్లా

మున్సిపాలిటీల్లో ప్రీ ఆడిట్ విధానాన్ని అమలు చేయాలి

- పురపాలక సంఘాల స్థితిగతులపై ఉన్నతాధికారులకు నివేదిక
- మున్సిపల్ అధికారుల సమావేశంలో స్టేట్ ఆడిట్ డైరెక్టర్ హరిప్రకాష్

కడప కార్పొరేషన్: జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ప్రీ ఆడిట్ విధానాన్ని అమలు చేయాలని స్టేట్ ఆడిట్ డైరెక్టర్ హరిప్రకాష్ అన్నారు. ఆదివారం కడపలోని నగరపాలక సంస్థ సమావేశ మందిరలో అర్బన్ లోకల్ బాడీస్, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘాల స్థితిగతులపై ప్రణాళికలు రూపొందించి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు సమర్పించేందుకే ఈ ప్రీ ఆడిట్ నిర్వహిస్తున్నామన్నారు. జీఓ నంబర్ 74 ప్రకారం ఆయా మున్సిపాలిటీల్లో ప్రీ ఆడిట్ నిర్వహిస్తున్నామని, తొలుత దేవదాయ శాఖలో విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈ ప్రక్రియ వల్ల మున్సిపల్ నిధులు పదిలంగా ఉంటాయన్న భావన ప్రజల్లోకి వెళ్లి స్థానిక సంస్థలకు వారి తోడ్పాటు మరింత పెరుగుతుందన్నారు. పురపాలక సంఘాలు బలోపేతం కావడంతో దీని విశ్వసనీయత అందరికీ తెలుస్తుందన్నారు. మున్సిపాలిటీలకు అందాల్సిన నిధులు కూడా సకాలంలో అందుతాయన్నారు. అనంతరం పలు అంశాలపై ఆయన కమిషనర్లతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కడప డిస్ట్రిక్ట్ ఆడిట్ ఆఫీసర్ మంజుల, నగరపాలక సంస్థ ఎగ్జామినర్ లక్ష్మీ నాయుడు, అకౌంటెంట్ రాధిక, జిల్లాలోని పలువురు మున్సిపల్ కమిషనర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

కడప స్పోర్ట్స్: కడప నగరం మస్తాన్‌వలి వీధిలోని చదరంగం హాల్‌లో ఆదివారం నిర్వహించిన చదరంగం పోటీలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. 17వ అష్రఫ్–ప్రసన్న మంత్లీ రోలింగ్ ట్రోఫీలో భాగంగా నిర్వహించిన ఈ టోర్నమెంట్‌ను జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బి. అనీస్‌దర్బారీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదరంగం పోటీలకు జిల్లా వ్యాప్తంగా 44 మంది చెస్ క్రీడాకారులు హాజరుకావడం అభినందనీయమన్నారు. అనంతరం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. చీఫ్ ఆర్బిటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

విజేతగా మహీధర్: అష్రఫ్–ప్రసన్న మంత్లీ రోలింగ్ ట్రోఫీ చాంపియన్‌గా పోరుమామిళ్లకు చెందిన మహీధర్ విజేతగా నిలిచాడు.

దిగుబడి ఘనం.. ధర దీనం

తగ్గుతున్న నేరేడు ధరలు



కురబలకోట: అందరూ ఇష్టపడి ఔషధాల గనిగా భావించే నేరేడు పండ్ల ధరలు క్రమేణా తగ్గుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లు కిలో రూ.150 నుంచి రూ.200కు పైగా పలికిన నేరేడు పండ్లు రెండు రోజులుగా నాణ్యతను బట్టి రూ.60 నుంచి రూ. 80 వరకు మాత్రమే పోతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. నేరేడు సాగుకు అన్నమయ్య జిల్లా పెట్టింది పేరు. పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ అన్న కారణంగా ఈ సాగుపట్ల మక్కువ చూపుతున్నారు. ఉపాధి హామీ, హార్టికల్చర్ కింద విపరీతంగా సాగు ఉంది. దీంతో ఎక్కడ చూసినా నేరేడు చెట్లు కన్పిస్తున్నాయి. జిల్లాలో 1500 ఎకరాల దాకా సాగులో ఉన్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. మండలంలోని లెట్టు, కురబలకోట, అంగళ్లు గ్రామాల్లో ఈ సాగు విపరీతంగా ఉంది. ఒక్క కురబలకోట పరిసర ప్రాంతాల నుంచి రోజుకు వెయ్యి టన్నుల కాయలు హైదరాబాదు, చెన్నై, విజయవాడ, గుంటూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు రవాణా అవుతాయి. ధర తగ్గడానికి అధిక దిగుబడే కారణమని తెలుస్తోంది.

తండ్రి వంచనలో దిట్ట.. తనయుడు అబద్ధాల పుట్ట

'గత మా ఐదేళ్ల పాలనలో.. ఇప్పుడు మీ నాలుగేళ్ల పాలనలో వైఎస్సార్ జిల్లాలో జరిగిన అభివృద్ధి గురించి చర్చిద్దామా' - యువగళంలో నారా లోకేష్

ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు చెప్పడంలో టీడీపీ అధినేత చంద్రబాబుకు మించిన వారు మరొకరు లేరన్నది ఇంతకాలం రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. ఇప్పుడు నారా లోకేష్ తండ్రిని మించిపోతున్నారు. అధికారంలో ఉన్నన్నాళ్లు అభివృద్ధి అటు ఉంచితే, ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడి, తాజాగా తామే వైఎస్సార్ జిల్లాను ఉద్ధరించినట్లుగా బీరాలు పలకడం చూస్తే 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు' అన్నట్లుగా ఉంది పరిస్థితి అని పలువురు పెదవి విరుస్తున్నారు.

- పెదబాబు.. చినబాబు.. సేమ్ టు సేమ్...!
- అబద్ధాలు చెప్పడంలో తండ్రిని మించిన తనయుడు
- బీరాలు పలికేందుకు మాత్రమే పరిమితమైన యువగళం
- చంద్రబాబు 14ఏళ్ల పాలనలో జిల్లాకు చేసింది శూన్యం



సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లా అత్యంత నిర్లక్ష్యానికి గురైంది. అందుకు కారణం అప్పటి విపక్షనేత వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబాన్ని జిల్లా ఆదరిస్తుండటమే. అధికారంలో ఉండగా అభివృద్ధి చేసి ఇక్కడి ప్రజల మనసు గెలవాల్సి ఉండగా, అలాంటి చర్యలు లేకపోగా ఈ ప్రాంతంపై ప్రత్యేకంగా ద్వేషం చూపారు. పైగా ఆత్మాభిమానంపై దెబ్బకొట్టారు. రాష్ట్రంలో ఏ మూల ఏ చిన్న అలజడి రేగినా కడప గూండాలు, రాయలసీమ రౌడీలు అంటూ మాటకు ముందు కడప, మాట తర్వాత కడపను చేరుస్తూ సామాజిక, సాంస్కృతిక దాడి చేశారు.

గండికోటను నిర్మించిన వైఎస్సార్..

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాయలసీమకు ప్రాణప్రదమైన జీఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ పథకాలను రద్దు చేసే ప్రయత్నం చేశారు. అప్పట్లో రాయలసీమ వాసుల ఉద్యమాల ఫలితంగా ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సర్కార్ హయాంలో ఆ పనులు శరవేగంగా చేపట్టి ప్రాజెక్టులు, ప్రధాన కాలువలను నిర్మించారు. చంద్రబాబు సర్కార్‌లో అప్రాధాన్య జాబితాలో ఉన్న జిల్లాలోని గండికోట ప్రాజెక్టు సైతం పూర్తయింది. అక్కడి నుంచి లిఫ్ట్ ద్వారా నీరు తరలించి పులివెందుల నియోజకవర్గంలో పైడిపాళెం ప్రాజెక్టు నిర్మించారు. వామికొండ, సర్వరాయసాగర్ ప్రాజెక్టులు సైతం పూర్తయ్యాయి. వాస్తవం ఇలా ఉంటే పెదబాబు..చినబాబు మాయ మాటలు చెబుతూ జిల్లాను టీడీపీ హయాంలోనే ఉద్ధరించినట్లు బీరాలు పలకడం విమర్శలకు తావిస్తోంది. రాయలసీమ చివరి పల్లెకూ నీళ్లిచ్చే క్రమంలో 5 టీఎంసీల గండికోట ప్రాజెక్టుకు చేర్చిన ఆత్మవంచన నుంచి 27 టీఎంసీల గండికోటలో నిల్వ చేసే స్థాయికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ చేరింది. టీడీపీ హయాంలో ఎండబెట్టిన బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులో 17 టీఎంసీల పూర్తి సామర్థ్యం నీరు నిల్వ చేశారు. 'పులివెందుల పంచాయితీ' అంటూ ఎగతాళి మాటలను కట్టడి చేస్తూ అదే పులివెందులలో మెడికల్ కాలేజీని నిర్మిస్తున్నారు.

వైఎస్ జగన్ సర్కార్ సైతం...

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ సైతం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టు పనుల పూర్తికి అత్యంత ప్రాధాన్యతను ఇచ్చింది. జీఎన్ఎస్ఎస్ పరిధిలోని పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు రూ.1,100 కోట్లకు పైగానే ఖర్చు చేసింది. మరో రూ.11 వేల కోట్లతో ఎర్రబల్లి లిఫ్ట్ స్కీమ్, గండికోట సీబీఆర్, గండికోట పైడిపాలెం లిఫ్ట్, పులివెందుల మైక్రో ఇరిగేషన్, జీఎన్ఎస్ఎస్ టు హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్, అలవలపాడు లిఫ్ట్, జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ విస్తరణ పనులను కొనసాగిస్తోంది. రూ.3వేల కోట్లు వెచ్చించి కుందూ, తెలుగుగంగ లిఫ్ట్ పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. డిసెంబర్ నాటికి జీఎన్ఎస్ఎస్ పరిధిలో 50వేల ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేందుకు సన్నద్ధమవుతోంది.

పారిశ్రామికాభివృద్ధి సైతం..

పారిశ్రామికాభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేసింది. కొప్పర్తి పారిశ్రామికవాడలో వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చర్ క్లస్టర్ ఏర్పాటు చేసింది. అందులో దాదాపు రూ.10వేల కోట్లు పెట్టుబడులకు మార్గమేర్పడింది. తద్వారా లక్ష ఉద్యోగాలు దక్కనున్నాయి. బద్వేల్ సమీపంలో సెంచురీ ప్లైబోర్డ్స్ పరిశ్రమను రూ.956 కోట్లతో నిర్మించారు. దాదాపు 2,662 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ నుంచి ఉత్పత్తులు ప్రారంభం కానున్నాయి. జమ్మలమడుగు సమీపంలో జేఎస్‌డబ్ల్యు సంస్థ నేతృత్వంలో ఫిబ్రవరి 15న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమి పూజ చేశారు. తొలివిడతలో రూ.3,300 కోట్లతో 10లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మించనున్నారు. పులివెందులలో రూ.500 కోట్లతో కొత్తగా మెడికల్ కళా శాల, కడప రిమ్స్‌లో రూ.107 కోట్లతో కేన్సర్ ఆస్పత్రి, రూ.125 కోట్లతో సూపర్ స్పెషాలిటీ బ్లాకు, రూ.40. 81 కోట్లతో మానసిక చికిత్సాలయంతోపాటు పుష్పగిరి కంటి ఆస్పత్రి నెలకొల్పారు. ఇదంతా కళ్లకు కన్పిస్తున్న వాస్తవమైతే మా ఐదేళ్ల పాలన, మీ నాలుగేళ్ల పాలనపై చర్చకు సిద్ధమా? అని నారా లోకేష్ బీరాలు పలుకుతుండడం పలువుర్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తోంది.

నీరు–చెట్టు మినహా సాధించిందేమిటి...?

విజన్ 2020, ఇజ్రాయిల్ టెక్నాలజీ అంటూ ఊదరగొట్టిన చంద్రబాబు సర్కార్ నిర్దిష్టమైన అభివృద్ధి సాధించింది ఏమీ లేదని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. ఎక్కడైనా పరిగెత్తి నీటికి నడకలు నేర్పించడం, నడిచే నీటిని నిలువరించడం, తద్వారా భూగర్భ జలాలు పెంపొందించే చర్యలను చూశాం. కానీ, కొండలపై నుంచి చెరువుల్లోకి వేగంగా నీరు చేర్చే చర్యలకు చంద్రబాబు సర్కార్ ఉపక్రమించింది. అదే నీరు–చెట్టు పథకం ప్రధాన ఉద్దేశం. కడప గడపలో బుగ్గవంక మధ్యలో సైతం కోటి రూపాయాలకు పైగా ఇలాంటి పథకంతోనే కాలువ తీయడం ఇప్పటికి గుర్తుగా ఉండిపోయింది.


వ్యవసాయం దండగన్న బాబు



తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు గతంలో వ్యవసాయం దండగ అని వ్యాఖ్యానించి రైతులను అవమాన పరిచే విధంగా మాట్లాడారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రైతులపై ఏమాత్రం శ్రద్ధ వహించ లేదు. జిల్లాలో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు మాత్రమే సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. జిల్లా అభివృద్ధికి తమవంతుగా పాటుపడ్డారు.

– ముతుకూరు మస్తాన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, భారతీయ కిసాన్ సంఘ్, పాములూరు, వైఎస్సార్ జిల్లా

ప్రాజెక్టులను విస్మరించిన బాబు



సాగునీటి రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేయడం ద్వారా రాయలసీమకు ద్రోహం చేసింది చంద్రబాబు నాయుడు. తెలుగుగంగ పూర్తి చేసి బ్రహ్మంసాగర్‌కు నీళ్లు వస్తే చూడాలన్నది తన చివరి కోరిక అంటూ అప్పటి మంత్రి బిజివేముల వీరారెడ్డి అఖిలపక్ష నేతలతో పాటు సీఎం చంద్రబాబు వద్ద మొర పెట్టుకున్నప్పటికీ పెడచెవిన పెట్టారు. పైగా 'గంగ'ను అప్రాధాన్యం కింద చేర్చారు. 2014–19 మధ్య చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు కేసీ కెనాల్ ఆయకట్టు స్థిరీకరణ కోసం ఉద్దేశించిన రాజోలు రిజర్వాయర్ నిర్మాణాన్ని ఏమాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. ఎన్‌డీఏలో భాగస్వామిగా ఉన్నప్పటికీ కడప ఉక్కును విస్మరించింది చంద్రబాబే. మూతపడిన చెన్నూరు షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని కోరితే మీరు నడుపుతారా? అంటూ అఖిలపక్ష నాయకులను ఎగతాళి చేసింది చంద్రబాబే. కాగా పాదయాత్రలో నారా లోకేష్ అసత్య ప్రచారాలకు ఒడిగట్టడం తగదు.

– సుంకేసుల బాదుల్లా, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, నూర్‌బాష్ దూదేకుల సంఘం, కడప

క్లుప్తంగా

స్కూల్ బస్సు ఢీ: వ్యక్తి దుర్మరణం

ఓబులవారిపల్లి : నాలుగో నెంబరు జాతీయ రహదారి మంగళంపల్లి అడ్డరోడ్డు వద్ద స్కూల్ బస్సును ఢీ కొని జి వెంకటేష్ (30) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు అనంతరాజుపేట బీసీ కాలనీకి చెందిన వెంకటేష్ ఆదివారం చిట్వేలి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు.తిరిగి మంగళంపల్లి మార్గం నుంచి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయలుదేరాడు. జాతీయ రహదారిపైకి రాగానే ఎదురుగా వస్తున్న ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సును ఢీ కొంది. దీంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సతీమణి శైలజ వలంటీరుగా పనిచేస్తోంది. వెంకటేష్‌కు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఇతను మంగంపేట త్రివేణి కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మహిళను మదనపల్లె ఎస్ఈబీ డీటీఎఫ్ విభాగం పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం డీటీఎఫ్ ఎస్‌ఐ వై.బాబు ఆధ్వర్యంలో నాయనబావి వద్ద తనిఖీలు నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలోని తాకటంవారిపల్లెకు చెందిన సరోజమ్మ(55) ఇంటిలో 61 లీటర్ల కర్ణాటక మద్యం పట్టుబడింది. ఆమెను అరెస్టు చేసి, కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సరోజమ్మకు మద్యం సరఫరా చేసిన ఆర్.చాంద్‌బాషాపై కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. దాడుల్లో ఎస్ఈబీ కానిస్టేబుళ్లు నాగరాజు, షేర్ అలీ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ వద్ద సైకో వీరంగం

పోరుమామిళ్ల : పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం మధ్యాహ్నం ఓ సైకో చేసిన వీరంగంతో అక్కడున్నవారు బెంబేలెత్తి పోయారు. బ్లేడుతో శరీరాన్ని కోసుకుంటూ, కేకలు వేస్తూ రోడ్డుపై స్వైర విహారం చేస్తుంటే ఎవరూ అతని వద్దకు వెళ్లే ధైర్యం చేయలేకపోయారు. కొందరు భయంతో స్టేషన్ లోపలకు వెళ్లారు. రాళ్ల దాడికి కారు అద్దాలు పగిలిపోయాయి. పావుగంటకుపైగా రోడ్డుపై ట్రాఫిక్ ఆగిపోయింది. ఎట్టకేలకు కొందరు ధైర్యం చేసి స్టేషన్‌లోకి పట్టుకుపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి అతనిపై కేసు నమోదు చేసి తహసీల్దారు వద్ద బైండోవర్ చేసినట్లు తెలిసింది. అతని పేరు రాజుపాలెం మస్తాన్‌వలి (35)గా, రంగసముద్రం పంచాయతీలోని సుందరయ్య కాలనీకి చెందిన వాడుగా తెలిసింది. పోలీసుల సమాచారం మేరకు అతను విశాఖపట్నంలో ఉండి అక్కడ దొంగతనాలు చేస్తుండేవాడు. అతనిపై కేసులు కూడా ఉన్నట్లు సమాచారం. పోరుమామిళ్లకు వచ్చి సుందరయ్యకాలనీలో కుటుంబంతో ఉన్నట్లు తెలిసింది. అతనికి మానసిక స్థితి సరిగా లేదని, ఆదివారం బాగా తాగిన మైకంలో సైకోగా మారి అల్లరి చేశాడని పోలీసులు తెలిపారు. అతన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు చెప్పారు.

ఖరీఫ్ సాగుకు సర్వం సిద్ధం

- అందుబాటులో 86 వేల మెట్రిక్ టన్నులు ఎరువులు
- 2023-24 ఆర్థిక సంవత్సరాన్ని మిల్లెట్ ఇయర్‌గా ప్రకటిద్దాం
- జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

రాయచోటి : వానాకాలం (ఖరీఫ్) సాగుకు ప్రత్యేక ప్రణాళికలతో రైతులను సిద్ధం చేస్తున్నట్లు అన్నమయ్య జిల్లా వ్యవసాయాధికారి బి చంద్రానాయక్ అన్నారు. వ్యవసాయ అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. జిల్లాలో ఖరీఫ్‌లో లక్ష హెక్టార్లకుపైగా వానాకాలం పంటలు సాగులో ఉంటాయని చెప్పారు. జిల్లాలో ఎంతమేర విత్తనాలు, ఎరువులు అవసరమవుతాయి, తదితర అంశాలతో ప్రణాళికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించనున్నారు. ఈ వానాకాలంలో అన్ని పంటలు కలిపి లక్ష హెక్టార్లలో సాగుచేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. రైతులు వేరుశనగ, వరి పంటల సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ ఏడాది లక్షల హెక్టార్లకు పైగా సాగయ్యే అవకాశం ఉందని అంచనాకు వచ్చినట్లు చెప్పారు. వేరుశనగ 55 వేల హెక్టార్లలో, వరి 10 వేలు, కంది 5 వేలు, ఉలవ 7500, మొక్కజొన్న 1500, సజ్జ 1500 హెక్టార్లలో సాదారణంగా సాగు అవుతుందన్నారు. వీటితోపాటు మరికొన్ని రకాల పండ్లు, కూరగాయలు, ఆకు కూరల తోటలు కూడా అధికంగా సాగు చేస్తారని చెప్పారు.

50 శాతం సబ్సిడీతో విత్తనపు కాయలు..

ప్రధాన పంట సాగుకు అవసరమైన వేరుశనగ విత్తనపు కాయలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందని చెప్పారు. లక్ష క్వింటాళ్ల విత్తనపు కాయలను అందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఇప్పటికే 45 వేల క్వింటాళ్లను 50శాతం సబ్సిడీతో ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందించామన్నారు. మరో ఐదువేల క్వింటాళ్ల అనుమతులు కూడా వచ్చాయన్నారు. మరింత అవసరం మేరకు కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపితే సబ్సిడీ ద్వారా ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

పదివేల హెక్టార్లలో వరిసాగు

జిల్లాలో బావులు, బోరుబావులు, చెరువులు,కాలువలు ద్వారా పదివేల హెక్టార్లలో వరి పంటను సాగు చేస్తారని చెప్పారు. వరి విత్తనాలు కూడా ఆర్‌బీకేల ద్వారా నమోదు చేసుకుంటే వారికి అవసరమైన విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందని అన్నారు.

అందుబాటులో ఎరువులు

జిల్లాలో పంటలకు అవసరమైన ఎరువులను ప్రభుత్వం సిద్ధంగా ఉంచిందన్నారు. ప్రస్తుతం 86వేల మెట్రిక్ టన్నులను రైతులకు అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. అవసరమైన వారు ఆర్‌బీకేల ద్వారా ప్రతిపాదనలు పెడితే అందజేయడానికి సిద్ధమన్నారు.

మిల్లెట్ ఇయర్

2023-24 సంవత్సరాన్ని మిల్లెట్ ఇయర్‌గా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. వరికి బదులుగా చిరు ధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని చంద్రానాయక్ చెప్పారు. కంది, రాగి, కొర్రలు విత్తనాలు కూడా 50శాతం సబ్సిడీపై అందజేస్తామన్నారు. చిరు ధాన్యాలను పండిస్తే కల్లాల్లోనే వందశాతం డబ్బులు చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. జొన్నలు, సజ్జలు కూడా ఖరీఫ్‌లో సాగు చేసుకోవడానికి ఉచితంగా పీడీఏ సిస్టం ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు.

ఆధునిక సాగుతోనే అధిక దిగుబడులు

వ్యవసాయంలో ఎప్పటికప్పుడు ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా గణనీయమైన దిగుబడులతో మంచి లాభాలను పొందొచ్చని జిల్లా వ్యవసాయ అధికారి బి చంద్రానాయక్ అన్నారు. వేలమంది రైతులతో లక్షకుపైగా ఎకరాలతో విస్తారంగా ఉన్న వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయశాఖ పనిచేస్తోందన్నారు. సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల స్థానంలో గొప్ప పరివర్తనను తీసుకొస్తామన్నారు. అసంఘటిత రంగంలో ఉన్న రైతులకు సంఘటిత శక్తిలోని బలమెంతో చూపించేందుకు, మేలైన సాగు విధానాలు, లాభసాయక పద్ధతులు చెప్పేందుకు వ్యవసాయశాఖ మార్గదర్శనం చేస్తుందన్నారు. అనేక రకాల పంటల సాగులో జిల్లా వ్యవసాయ జిల్లాగా ఖ్యాతిని సాధిస్తుందన్నారు. దానికి తగ్గట్టుగా వ్యవసాయ, అనుబంధ శాఖలు సంస్థాగతంలో బలోపేతం అవుతాయన్నారు.



బి చంద్ర నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి, అన్నమయ్య జిల్లా

వ్యవసాయంలో ఆధునిక డ్రోన్‌ల వినియోగం

వ్యవసాయంలో డ్రోన్ పాత్ర అమోఘమన్నారు. కూలీలు, మందుల పిచికారీ సమస్యలకు తరుణోపాయంగా ఆశలు కల్పిస్తోందని అభిప్రాయపడ్డారు. రెండు దశాబ్దాల క్రితం వరకు నిఘా కార్యకలాపాలకే పరిమితమైన ఈ బుల్లిమానవ రహిత విమానం ప్రతిచోట తన ఉనికిని చాటుతోందన్నారు. రక్షణ, భద్రత, ఆర్థికం, మైనింగ్, వ్యవసాయం, విపత్తుల నిర్వహణ, సరుకు రవాణా వరకు ప్రతి రంగంలో విశిష్ట సేవలందిస్తూ ఆకట్టుకుంటోందన్నారు.నెమ్మదిగా సరికొత్త రూపు సంతరించుకొని బహుళ సౌకర్యాలతో నిఘా విభాగం రక్షణ గోడలు దాటుకుని ఇప్పుడు పొలంలోకి అడుగు పెట్టిందన్నారు. మారుతున్న కాలంతోపాటు పెరుగుతున్న జనాభాకి సరిపడా ఆహారం పండించాలన్నారు. వ్యవసాయంలో పెరుగుతున్న వ్యవసాయ కూలీల కొరతను అధిగమించాలని, వ్యవసాయరంగంలో నూతన సాంకేతికలతో కూడిన మార్పు రావాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని తెలిపారు. వ్యవసాయం హైటెక్ పరుగులు పెడుతోందని వాతావరణ పరిస్థితులు మొదలుకొని నాట్లు వేయడం, విత్తనాలు చల్లడం, కలుపు తీయడం, కోతలు కోయడం వరకు అన్ని పనుల్లోనూ రోబోలు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వాడకం పెరుగుతోందన్నారు. దుక్కి దున్నే ట్రాక్టర్ నుంచి పంటకోసే మిషన్ల వరకు ప్రస్తుతం అందుబాటులో ఉండగా పంటలు ఎప్పుడు వేయాలి, ఎప్పుడు కోయాలి, పురుగు పడితే ఏం చేయాలని చెప్పేందుకు మొబైల్ యాప్‌లు రెడీ అయ్యాయని, నూతన ప్రయోగాలతో పాటు సరికొత్త ఆవిష్కరణలు, యంత్రాలు తయారు అవుతున్నాయని తెలిపారు. అయితే మారుతున్న కాలంతో పాటు వ్యవసాయ రంగంలో నూతన సాంకేతికాలతో కూడిన డ్రోన్‌ల యొక్క వినియోగాన్ని పెంచడం ఎంతైనా అవసరమన్నారు. జిల్లాలో ఏడు డ్రో న్‌లు మంజూరుకు అనుమతులు లభించాయని జి చీల్లా వ్యవసాయ అధికారి చంద్రా నాయక్ తెలిపారు.

ఏఎంసీ మాజీ డైరెక్టర్ వెస్లీపై క్రిమినల్ కేసు

మదనపల్లె : ఆరోగ్యవరం మెడికల్ సెంటర్(ఏఎంసీ) మాజీ డైరెక్టర్ బి.వెస్లీ, ఆయన కుమారుడు డాక్టర్.రిచర్డ్స్ స్టీఫెన్ వెస్లీ, పర్సనల్ సెక్రటరీ రేణుక కరుణాకర్‌పై ఆదివారం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. ఏఎంసీ డైరెక్టర్ డాక్టర్. కే.పి.రవీంద్ర ఫిర్యాదుమేరకు మాజీ డైరెక్టర్ వెస్లీ, ఆయన కుమారుడు, పర్సనల్ సెక్రటరీపై కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. ఏఎంసీ మాజీ డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన డాక్టర్. వెస్లీ తన హయాంలో జరిపిన ఆర్థిక లావాదేవీలు, అక్రమాలు వెలుగుచూడకుండా వాటికి సంబంధించిన విలువైన కీలకపత్రాలు, ఆస్తులకు సంబంధించిన దస్త్రాలను మాయం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. అలాగే డైరెక్టర్ కార్యాలయంలోని సీపీయూలో నమోదై ఉన్న లావాదేవీలు, నిధుల దుర్వినియోగానికి సంబంధించి వ్యవహారాలు ఎక్కడ బయటపడతాయేమోననే భయంతో సీపీయూతో పాటు అత్యవసర రికార్డులను దొంగిలించుకు వెళ్లినట్లు చెప్పారన్నారు. రాయలసీమ డయాసిస్ బిషప్. రెవ. డాక్టర్.పి.ఐజాక్ వరప్రసాద్ సూచనలతో ఏఎంసీ నూతన డైరెక్టర్ కేపీ రవీంద్ర తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారన్నారు. దీంతో ఎఫ్ఐఆర్ నంబర్.195/2023 సెక్షన్స్ 379, 201, 404 రెడ్‌విత్ 34 ఐపీసీ కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. కాగా.. ఈనెల 2వ తేదీ ఏఎంసీ నూతన డైరెక్టర్, బిషప్‌తో పాటు మరో ఆరుగురిపై మాజీ డైరెక్టర్ వెస్లీ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన తాలూకా పోలీసులు, 10వ తేదీ ప్రతివాదులపైనే కౌంటర్ కేసులు నమోదుచేయడం గమనార్హం. టీబీ నివారణలో దేశవ్యాప్తంగా పేరు మోసి, వేలాది మంది క్షయరోగులకు స్వస్థత చేకూర్చిన ఏఎంసీ ఇరువర్గాల మధ్య వివాదంతో ప్రతిష్ట కోల్పోతుండటంపై పట్టణ ప్రజలు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘనచరిత్ర కలిగిన ఏఎంసీ కీర్తిప్రతిష్టలను కాపాడేందుకు, వివాదాలకు స్వస్తి పలికేందుకు క్రైస్తవ మిషనరీలు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ ఎస్‌కేఆర్ నగర్ ఎస్సీకాలనీలో వెలసిన శ్రీ అంకాలమ్మ తిరునాల సందర్భంగా ఆదివారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ప్రారంభించారు. మూడు జతల ఎడ్లు పాల్గొన్నాయి.ప్రథమ బహుమతి కింద రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ సిద్దవటం మండల ఇన్‌చార్జి మేడా మదుసూదన్‌రెడ్డిలు రూ. 70 వేలను ఇచ్చారు. ప్రథమ బహుమతి అన్నమయ్య జిల్లా నందలూరు మండలానికి చెందిన హబీబుల్లా ఎడ్లు గెలుచుకున్నాయి. రెండవ బహుమతి దాత కడపకు చెందిన మామిడి శేషారెడ్డి. రూ. 50వేలు ఇచ్చారు. బాపట్ల జిల్లా, చుండూరు మండలం, వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోటి శిరీషా చౌదరి, శివక్రిష్ణా చౌదరి ద్వితీయ స్థానంలో నిలిచాయి. మూడవ బహుమతి దాత మాధవరం-1 మాజీ సర్పంచ్ మేకపాటి సుబ్బారెడ్డి రూ. 30 వేలు ఇచ్చారు. వైఎస్సార్ జిల్లా కాశినాయన మండలం, నర్సాపురం గ్రామానికి చెందిన కామిని వెంకటసాయిప్రతాప్‌రెడ్డి ఎడ్లు మూడో స్థానంలో నిలిచాయి.ఈ బహుమతులను ఆలయం వద్ద పెద్దల సమక్షంలో ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీరెడ్డి, మేకపాటి సుబ్బారెడ్డి, మామిడి శేషారెడ్డి, నారాయణరెడ్డిలు ఎడ్ల యజమానులకు అందజేశారు.

కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణాల శాఖ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్ఆర్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లిచాన్, మాజీసర్పంచ్ గాలి ఓబులయ్య, స్థానిక నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, జానపాటి సుబ్బరాయుడు, వెంకట్, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు దెబ్బతిన్న అరటితోటలు

రాజంపేట రూరల్ : ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంట చేతికివచ్చే సమయంలో ఈదురు గాలుల ధాటికి అరటితోటలు నేలకొరిగాయి. శనివారం రాత్రి వీచిన ఈదురుగాలులకు మండల పరిధిలోని ఆకేపాడు, హస్తవరం, మిట్టమీదపల్లి రైతు భరోసా కేంద్రాల పరిధిలో 14 మంది రైతులకు చెందిన 38 ఎకరాల్లో అరటిపంట దెబ్బతింది. ఉద్యాన అధికారి జే సురేష్ బాబు, ఆర్‌బీకే సిబ్బంది ఆదివారం నేలకొరిగిన అరటిపంటను పరిశీలించారు. రైతులు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించి పంట నష్ట వివరాలను నమోదు చేయించుకోవాలని తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు వారు తెలియజేశారు.

అరటి తోటల పరిశీలన : ఈదురు గాలులకు నేలకొరిగిన అరటిపంటను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఏ.చెంచురెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, జంగంరెడ్డి, పీ వేణుగోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వీఆర్‌ఓ ప్రసాద్, వీఆర్ఏలు నరసింహులు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

బైక్, కారు ఢీ : ఇద్దరు మైనర్లు మృతి





హర్షవర్ధనాచారి, నరేంద్రాచారి మృతదేహం



ప్రమాదానికి గురైన ద్విచక్రవాహనం

గుర్రంకొండ : అక్క కుమారుడికి నేడు పాఠశాలలు తెరుచుకుంటాయి. త్వరగా ఇంటికి తీసుకెళ్లి వదిలిపెట్టి రావాలని ఇద్దరు మైనర్లు ద్విచక్రవాహనంలో బయలు దేరారు. విధి వక్రీకరించి రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలకేంద్రమైన గుర్రంకొండలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీ మొరంకిందపల్లె గ్రామానికి చెందిన పట్నం వెంకటరమణాచారి, అశ్వనీల కుమారుడు పట్నం హర్షవర్ధనాచారి(7) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. ఇదే మండలం శెట్టివారిపల్లె పంచాయతీ బోడిగుట్టకు చెందిన కె.యల్లప్ప ఆచారి, నాగరాణిల కుమారుడు కె. నరేంద్రాచారి(16) అశ్వనీకి స్వయానా తమ్ముడు. వేసవి సెలవుల్లో హర్షవర్ధనాచారి తన అమమ్మ ఇంటికి వచ్చాడు. సెలవులు ముగియడం, ఈనెల 12న పాఠశాలలో ప్రారంభం కానున్న నేపథ్యంలో తిరిగి స్వగ్రామానికి వెళ్లాలనుకున్నాడు. అయితే బోడిగుట్ట నుంచి మొరంకింద పల్లెకు వెళ్లడానికి సరైన బస్సు సౌకర్యం లేదు. దీంతో నరేంద్రాచారి హర్షవర్ధనాచారిని ద్విచక్రవాహనంపై కూర్చొబెట్టుకొని మొరంకిందపల్లెకు బయలుదేరాడు. గుర్రంకొండకు సమీపంలో గౌస్‌మోహిద్దీన్ డాబా వద్ద ఎదరుగా వస్తున్న కారును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నరేంద్రాచారి, హర్షవర్ధనాచారి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

పెళ్లికి అడ్డువస్తోందని ప్రేయసి తల్లి హత్య

మదనపల్లె : ప్రేయసితో పెళ్లికి అంగీకరించకపోగా, తనను కలిసేందుకు సైతం తల్లిదండ్రులు అడ్డుగా వస్తున్నారనే అక్కసుతో ప్రియురాలి తల్లిని అత్యంత కర్కశంగా హత్యచేసిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రామసముద్రం మండలంలో మహిళ గొంతు కోసి దారుణంగా హత్యచేసిన ఘటనలో మిస్టరీ వీడింది. మృతురాలు లక్ష్మీదేవమ్మ కుమార్తె ధనలక్ష్మీతో సహజీవనం చేసి పెళ్లిచేసుకోవాలనుకున్న డెలివరీబాయ్ అంజనీకుమార్‌రెడ్డిని హత్యకేసులో నిందితుడిగా నిర్ధారించి ఆదివారం అరెస్ట్‌చేశారు. మదనపల్లె డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నిందితుడిని హాజరుపరిచారు. కర్ణాటక రాష్ట్రం ముళబాగల్ తాలూకా బైరకూరు పంచాయతీలోని శీకూరుకు చెందిన శంకర్‌రెడ్డి, పుంగనూరు మండలం పాలెంపల్లెకు చెందిన లక్ష్మీదేవమ్మ(55) భార్యాభర్తలు. పుంగనూరు పట్టణంలోని ఉబేదుల్లా కాంపౌండ్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ధనలక్ష్మి(35) ఒక్కగానొక్క కుమార్తె. చౌడేపల్లె మండలం తెల్లనీళ్లపల్లెకు చెందిన రెడ్డెప్పకు ఇచ్చి పదేళ్ల క్రితం వివాహం చేశారు. అంగన్‌వాడీ వర్కర్‌గా పనిచేస్తోంది. ఒక కుమార్తె. ఐదేళ్ల క్రితం భర్త మరణించాడు. శంకర్‌రెడ్డి, లక్ష్మీదేవమ్మ దంపతులు రామసముద్రం మండలం కేసీపల్లె పంచాయతీలోని సమీపబంధువైన ప్రకాష్‌రెడ్డి వ్యవసాయ పొలంలో కాపలాగా ఉంటూ గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తున్నారు. ధనలక్ష్మి తన కుమార్తెకు కావాల్సిన దుస్తులు, ఇతర వస్తువులను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేది. రామసముద్రం మండలం అరికెల పంచాయతీ గోసువారిపల్లెకు చెందిన అంజనీకుమార్‌రెడ్డి కొరియర్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ధనలక్ష్మి ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన దుస్తులను డెలివరీ చేసే క్రమంలో ఆమెతో ఏర్పడిన పరిచయం సహజీవనానికి దారి తీసింది. ధనలక్ష్మితో తాను గడిపిన సమయంలో రహస్యంగా వీడియోరికార్డింగ్ చేసుకుని ఆమె తల్లిదండ్రులైన శంకర్‌రెడ్డి, లక్ష్మీదేవమ్మలకు వాటిని చూపి తనకు రూ.5లక్షలు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశాడు. ఇవ్వకపోతే అశ్లీల వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించాడు. చెప్పినట్లుగానే ఫేస్‌బుక్‌లో, వాట్సప్‌లో వాటిని అప్‌లోడ్ చేసి ధనలక్ష్మి ఫోన్‌నంబర్‌ను వాటికి జతపరిచాడు. దీంతో కొందరు ధనలక్ష్మికి ఫోన్‌చేసి అసభ్యంగా ప్రవర్తించడంతో ఆవేదన చెందిన ఆమె చౌడేపల్లె పోలీస్‌స్టేషన్‌లో అంజనీకుమార్‌రెడ్డి తనను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని కేసు పెట్టింది. ఈ కేసులో అరెస్ట్ అయిన అంజనీకుమార్ రెడ్డి సుమారు 20 రోజుల పాటు మదనపల్లె సబ్‌జైలులో రిమాండ్‌ఖైదీగా ఉండి బెయిల్‌పై బయటకు వచ్చాడు. ధనలక్ష్మి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి తమ కుమార్తెతో తనకు వివాహం జరపాల్సిందిగా కోరాడు. దీనికి వారు అంగీకరించకపోగా, అంజనీకుమార్‌రెడ్డి మోసాలు, వ్యసనాలు, చెడుతిరుగుళ్లపై కుమార్తె ధనలక్ష్మికి వివరించి దూరంగా ఉండాల్సిందిగా కోరారు. తల్లిదండ్రులు చెప్పినట్లే ధనలక్ష్మి అంజనీకుమార్‌రెడ్డిని దగ్గరకు రానివ్వకపోవడం, మాట్లాడేందుకు నిరాకరించింది. ధనలక్ష్మిని తనకు దూరం చేశారనే అక్కసుతో ఆమె తల్లిదండ్రులపై కక్ష పెంచుకున్నాడు. కేసీ పల్లె ప్రకాష్‌రెడ్డి వ్యవసాయక్షేత్రంలో ఓసారి ఒంటరిగా ఉన్న ధనలక్ష్మి తల్లి లక్ష్మీదేవమ్మపై హత్యాయత్నం చేయబోతే, ఆమె వెంటనే తన భర్త శంకర్‌రెడ్డికి ఫోన్‌చేయడం, ఆయన వెంటనే అక్కడకు రావడంతో అంజనీకుమార్‌రెడ్డి అక్కడ నుంచి పారిపోయాడు. తర్వాత అవకాశం కోసం ఎదురుచూస్తుండగా, ఈనెల 9వ తేదీ రామసముద్రం మండలంలో తెలిసిన బంధువు మరణిస్తే వారిని చూసేందుకు వెళుతూ.. భర్త శంకర్‌రెడ్డి భార్య లక్ష్మీదేవమ్మను ఫామ్‌హౌస్‌లో ఒంటరిగా విడిచిపెట్టి వెళ్లాడు. విషయం తెలుసుకున్న అంజనీకుమార్ రెడ్డి లక్ష్మీదేవమ్మను చంపాలని నిర్ణయించుకుని ఫామ్‌హౌస్‌కు చేరుకుని కత్తితో పొడిచేందుకు ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో చేతిపై కత్తిగాయాలయ్యాయి. గట్టిగా ఆమెను ఒడిసిపట్టుకుని నేలమీద పడుకోబెట్టి కసితీరా గొంతుకోసి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న లక్ష్మీదేవమ్మ కుమార్తె ధనలక్ష్మి తల్లి హత్యపై శనివారం పోలీసులకు ఫిర్యాదుచేసింది. సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐ చంద్రశేఖర్ ఘటనాస్థలానికి చేరుకుని క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్, టెక్నికల్ ఎక్స్‌పర్ట్స్ సహాయంతో ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ధనలక్ష్మి, మృతురాలి భర్త శంకర్‌రెడ్డి అంజనీకుమార్‌రెడ్డిపై అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. హత్యజరిగిన సమయంలో నిందితుడి సెల్‌ఫోన్ సిగ్నల్స్, టవర్ లొకేషన్ సరిపోవడంతో నిందితుడి ఫోన్ నంబర్ ఆధారంగా సిగ్నల్స్ ట్రేస్ చేసి ఆదివారం పుంగనూరు పట్టణం అంబేడ్కర్ సర్కిల్ వద్ద అరెస్ట్ చేశారు. అంజనీకుమార్‌రెడ్డిపై చౌడేపల్లె పోలీస్‌స్టేషన్‌లో నాలుగు కేసులు ఉన్నాయని, మహిళ హత్యకేసులో ప్రమేయం ఉన్నట్లు తేలడంతో నిందితుడిపై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. ఘటన జరిగిన 24 గంటల్లోపే కేసును ఛేదించిన తాలూకా సీఐ శివాంజనేయులు, వన్‌టౌన్ సీఐ షేక్‌మహబూబ్‌బాషా, ఎస్‌ఐ చంద్రశేఖర్‌ను డీఎస్పీ కేశప్ప ప్రత్యేకంగా అభినందించారు. నిందితుడు అంజనీకుమార్‌రెడ్డిని రిమాండ్‌కు పంపారు.



నిందితుడు అంజనీకుమార్‌రెడ్డి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ కేశప్ప, సీఐ శివాంజనేయులు

మహిళపై దాడి

బి.కొత్తకోట : తన పెంపుడు కోడి కాలును ఎవరో విరగ్గొట్టారని తింటుకొంటున్న ఓ మహిళపై బంధువైన వ్యక్తి దాడిచేసిన ఘటన ఆదివారం మండలంలోని పప్పిరెడ్డిగారిపల్లెలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు..బయ్యప్పగారిపల్లె పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన రమణమ్మ (65) కోడిని పెంచుకుంటోంది. దీనిని రూ.3,500లకు విక్రయించాలని కొందరు ఆమెను కోరగా నిరాకరించింది. ఈలోగా సాయంత్రం కోడి కాలు విరిగి ఉండటం చూసి రమణమ్మ ఎవరో కాలు విరగ్గొట్టారని తిట్టుకుంటోంది. ఈ తిట్లను విని ఆమె బంధువైన శివకుమార్ ఆగ్రహంతో దాడిచేసి నెట్టడంతో కింద పడిపోయింది. దీనితో ఎడమ చేయి విరిగింది. నడుముకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సిబ్బంది 108లో బాధితురాలిని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. హెడ్‌కానిస్టేబుల్ రవీంద్రనాయక్ బాధితురాలి నుంచి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సోషల్‌మీడియాలో పోస్టింగ్ తెచ్చిన తంటా!



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మణి

రాజంపేట: ఓ వ్యక్తి సోషల్‌మీడియాలో పెట్టిన పోస్టింగ్ దాడికి దారితీసిన సంఘటన రాజంపేట మండలంలో మన్నూరు పోలీసుస్టేషన్ పరిధిలోని బోయనపల్లె హరితా హోటల్ వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఓబులవారిపల్లెకు చెందిన పత్తి మణి రాజంపేట పట్టణం మన్నూరులోని అత్త ఇంటిలో ఉంటూ రెండు కార్లు బాడుగకు తిప్పుకుంటూ, చికెన్ షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోషల్‌మీడియాలో పెట్టిన పోస్టింగ్ వల్ల తిరుపతికి చెందిన కొందరు వచ్చి తన భర్తను తీసుకెళ్లారని భార్య మన్నూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మన్నూరు పోలీసులు, రైల్వేకోడూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఓబులవారిపల్లె నుంచి చిట్వేలికి మణిని తీసుకెళ్లారు. చిట్వేలి పోలీసులు తిరుపతి నుంచి వచ్చిన ఏపీ03బీపీ6666, ఏపీ 39టీ/ఆర్‌లో 14మందిని పట్టుకొని మన్నూరు ఎస్‌ఐకి అప్పగించారు. మన్నూరు పోలీసులు విచారణ జరిపి కేసు నమోదు చేశారు. తాను పెట్టిన పోస్టింగ్ వల్లనే దాడి చేశారని, రాజంపేట ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మీడియాకు వెల్లడించారు.

తిరుపతి ఎమ్మెల్యేకు సంబంధంలేదు: డీఎస్పీ చైతన్య

మన్నూరులో ఉంటున్న పత్తిమణిపై దాడికి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డికి ఎటువంటి సంబంధంలేదని రాజంపేట డీఎస్పీ చైతన్య తెలిపారు. ఆదివారం డీఎస్పీ మాట్లాడుతూ మణితో మాట్లాడేందుకు తిరుపతికి చెందిన వారు వచ్చారన్నారు. ఇది కిడ్నాప్ సంఘటన కాదన్నారు.